

'మిట్స్' అధ్యాపకులు అరుణ్ ప్రసాద్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి- మదనపల్లి



అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అరుణప్రసాద్ ఆచార్యకు ఒడిశాలోని రూర్కెలాలో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పిహెచ్‌డి పట్టా లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. స్టడీ ఆఫ్ లోకలిసేషన్ ట్రాన్సిషన్ ఇన్ ణొన్ హెర్మిటియాన్ క్కురాసి పెరియాడిక్ సిస్టమ్స్‌పై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్‌ను అందించినట్లు పేర్కొన్నారు. అరుణ ప్రసాద్ ఆచార్య ను కరెస్పాండంట్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ భాస్కరన్, అభినందనలు తెలియజేశారు.

ఖరీఫ్ ..సాగు లేనట్టేనా?

భూములన్నీ బీళ్లు
ఖరీఫ్‌లో వింత ధోరణి
ఆగస్టు చివరి వారానికి సాగు అంతంతే
జిల్లాలో 65,386 హెక్టార్లు అంచనా



ఎండిపోతున్న వేరుశనగ

ప్రజాశక్తి - రాయచోటి

ఖరీఫ్‌లో వింత ధోరణి ఏర్పడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో భూములు బీళ్లుగా కనిపిస్తున్నాయి. ఆగస్టు చివరి వారమైనా చాలాచోట్ల సేద్యం లేక భూములు పచ్చదనం పరచుకోలేదు. మరోవైపు సెప్టెంబర్ లోపల అధికారిక రికార్డులలో రైతులచే పంట సాగు ఇ-క్రాప్ బుకింగ్ నమోదు చేయించాలని ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తెస్తోంది. జిల్లాలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 65,386 హెక్టార్లు ఉండగా ఇప్పటి వరకు 15,179 హెక్టార్లలో రైతులు సాగు చేశారు. విత్తనాలు తీసుకున్నప్పటి నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. కనీసం పొలంలో దుక్కి చేసుకో వడానికి కూడా వర్షాలు కురవడం లేదని కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మందికి బోర్లు ఉన్నప్పటికీ వర్షాల రాక పోవడంతో బోర్లలో నీటి శాతం కూడా తగ్గుతుందని వాపోతున్నారు. జిల్లాలో వరి, వేరుశనగ, పత్తి, పప్పు ధాన్యాలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక సేద్యంపై ఆశలు వదు లుకున్నారు. సీజన్ ప్రారంభమైన్నటి నుంచి ఈ ఏడాదిలో రైతుల్లో ఉత్సా హంగా కనిపించడం లేదు. వేసిన అరకొర పంట కూడా వర్షాభావం కారణంగా ఎండి పోతున్నాయి. పంటలు సాగు చేయకపోతే ప్రభుత్వం ఇచ్చే పెట్టు బడి సాయంను వెనక్కి ఇచ్చేయాలన్న భావంతో రైతులు ఏదో ఒక పంట వేసి ఇ-క్రాప్ ఇతర రికార్డులను నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వేరుశనగ గిట్టుబాటుగాక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 60 శాతం పంట సాగు చేయాల్సిందిగా కానీ ప్రస్తుతం 10 శాతం వరకు రైతులు పంట సాగు చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



జూన్ ఆరంభం నుండి వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. వేరుశనగ, కంది, ఇతర విత్తనాలను తెచ్చుకొని విత్తనాల వేయడానికి సిద్ధం చేసుకున్నాం. కానీ ఇప్పటి వరకు వర్షం కురవలేదు. వర్షం కురిస్తే పంటలు పండి తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరగవుతుంది అని ఆశిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

-రెడ్డప్ప,రైతు, మాధవరం , రాయచోటి.

వర్షాలు కురుస్తాయి

సెప్టెంబర్ మొదటి వారంలో అన్నమయ్య జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇప్పటికే కర్నూలు అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురిశాయి. ఇప్పటివరకు వేరుశనగ పంట వేసిన రైతులు ఒక లీటర్‌కు 20 గ్రాములు యూరియా కలిపి వేరుశనగ పంటకు స్ప్రే చేయాలి. ఇలా చేయడం వల్ల పంటను దాదాపు పది రోజుల వరకు తేమ శాతం వల్ల చెట్లను కాపాడుకోవచ్చు. ఈ లోపల వర్షాలు జిల్లాలో కురుస్తాయి. ఇప్పటి వరకు 70 శాతం ఇ-క్రాప్ నమోదు చేశాం. ఇప్పటివరకు జిల్లాలో పదివేల 400 కింటాలు ఉలవలు మంజూరైనాయి. వేరుశనగ పంట వెయ్యి నీ రైతులు ఉలవలు వేసుకోవచ్చు. సెప్టెంబర్ మొదటి వారంలో వర్షాలు పడే అవకాశం ఉంది. కావున రైతులు ఆందోళన చెందవద్దు.

-చంద్రా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, అన్నమయ్య జిల్లా,

ఇళ్ల స్థలాల పేరుతో ఘరానా మోసం

- నేతన్నలను ఏమార్చి రూ.2 కోట్లు వసూలు
- ఏడాది గడుస్తున్నా స్థలాలు చూపించలేదని నిలదీత
- మోసగాడు పరార్
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు




ఫిర్యాదు చేయడానికి పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని నేతన్నల వద్ద సుమారు రూ. 2 కోట్ల వరకు వసూలు చేశాడు ఓ ప్రబుద్ధుడు. ఏడాదిన్నర కావస్తున్నా ఇళ్ల స్థలాలు చూపలేదు. నేతన్నల వద్ద తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించ లేదు. మదనపల్లెలో ఘరానా మోసానికి పాల్పడిన ఇద్దరి వ్యక్తుల ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఘటనపై బాధితులు తాలూకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. సత్యసాయి జిల్లా, కదిరి మండలం ఒడిస్ సమీపంలోని ఇనగలూరుకు చెందిన రామాంజులు కుమారుడు మంజునాథ్ మదనపల్లె మండలం, కోళ్ల బైలు గ్రామం, బయ్యారెడ్డి కాలనీలోని అతని ప్రియురాలితో కలిసి నివాసం ఉండేవాడు. ఆమెకు పరిచయం ఉన్న చేనేతలు రామాంజలు, శ్రీరాములు, రేణుక, భారతి, భాస్కర్ వెంకటరమణ లతోపాటు మరో 150 మంది వద్ద ఒక్కో ప్లాట్‌కు రూ. 2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వసూలు చేశారు. ఆ డబ్బు తిరిగి నేతన్నలకు చెల్లించకుండా ముఖం చాటేశారు. మంజూనాథ్ మాత్రం తన స్వగ్రామమైన కదిరికి వెళ్లిపోవడంతో అతనితో ఉన్న మహిళ తనకు సంబంధం లేదని వెళ్లి అతడినే అడుక్కోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు ఆదివారం స్థానిక తాలూకా పోలీసులను ఆశ్రయించి, తమకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఏడాదిన్నర కాలం కావస్తున్నా తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడం, ఫోన్ చేస్తే స్పందించకపోవడంతో మోసపోయామని బాధితులు తమ గోడును పోలీసుల దృష్టికి తీసుకెళ్లి లబోదిబో మంటున్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీటి పర్యంతమౌతున్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లి అభివృద్ధి వేదిక నాయకులు హరిశర్మ, కృష్ణమూర్తితో కలసి విలేకరులతో మాట్లాడారు. మదనపల్లి పట్టణంలో ట్రాఫిక్ దడపుట్టిస్తోందని అన్నారు. పెరుగుతున్న జనాభాకు తోడుగా వాహనాల సంఖ్య పెరుగుతోందని అందుకు అనుగుణంగా రోడ్లు విస్తరించక పోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైందన్నారు. మదనపల్లి మున్సిపాలిటీగా ఏర్పడక ముందు ఉన్న రోడ్లే ఇప్పటికీ ఉన్నాయని, ఈ రోడ్లు సైతం ఆక్రమణలకు గురికావడం తో పట్టణ ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోయారు. పెన్షనర్ల స్వర్గధామంగా పేరు గాంచిన మదనపల్లె పట్టణం నేడు ట్రాఫిక్ సమస్య కారణంగా వారి పాలిట శాపంగా మారుతోందని, బయట తిరగాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నా ట్రాఫిక్ అడ్వయిజరి కమిటీ సమావేశం నిర్వహించిన ఏళ్లు గడుస్తున్నా అధికారులు స్పందించక పోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెంటనే ట్రాఫిక్ ఆడ్వైజరీ సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించాలని, రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సిగ్నల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పెంపు తదితర సమస్యలు పరిష్కారం కోసం కృషి చెయ్యాలని కోరారు. మదనపల్లె పట్టణంలో రెండు లక్షలకు పైబడి ప్రజలు నివసిస్తున్నారని ప్రతి ఇంటికి ఒకటి లేదా రెండు ద్విచక్ర వాహనాలు, ప్రతి రెండు ఇండ్లకు ఒక కారు ఉన్నాయన్నారు. నిత్యం ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల కోసం వేల మంది పట్టణంలో తిరుగుతున్నారని వివరించారు. నిత్యం లక్ష మందికి పైగా మదనపల్లె పట్టణంలో ద్విచక్ర, త్రిచక్ర, నాలుగుచక్రాల వాహనాల్లో తిరుగుతున్నారని అన్నారు. పట్టణ ప్రజలకు ట్రాఫిక్ నియంత్రణ పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ ప్రజలను భాగస్వామ్యం చేయకుండా సమస్య పరిస్కారం కాదని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం అగ్రభాగాన ఉంటూ పోరాటం చేస్తుందని అన్నారు. మదనపల్లి అభివృద్ధి వేదిక నాయకులు హరిశర్మ, కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని వెడల్పు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని పెంచాలని కోరారు. ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరుతూ జరిగే ఉద్యమాలకు ప్రజలు తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- మదనపల్లి

స్థానిక పట్టణంలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని కరెస్పాన్ డెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వైద్య శిబిరానికి 235 మంది కంటి పరీక్షలు నిర్వహించుకున్నారన్నారు. ఇందులో గ్లూకోమా, కార్నియా, రెటీనా, ఆర్బిట్, డక్ట్, చికిత్సలతో పాటు విజన్ పరీక్ష బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 48 మంది శస్త్ర చికిత్సలకు ఎంపిక కాగా. వారికి తిరుపతికి ఫోను రాను ఉచిత బస్సు వసతి తో పాటు భోజన సదుపాయం కల్పించినట్లు కరస్పాండెంట్ ఆర్.గురు ప్రసాద్ పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ రచన, డాక్టర్ ఆకాష్, ప్రిన్సిపాల్ రమాదేవి, నిర్వాకుడు వసంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

మాదిగల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో రామాంజనేయులు అధ్యక్షతన మాదిగల ఆత్మీయ సదస్సు కార్య క్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలిగించకుండా కేటాయించిన ఉద్యోగాలు వారికే దక్కేట్లు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాదిగల సమస్యల పరిష్కారానికి టిడిపి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని చెప్పారు. పట్టణంలో రాబోయే రోజులలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చి రాష్ట్రాలకు అధికారం ఇవ్వడాన్ని అభినందిస్తూ అందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు. అదే క్రమంలో వర్గీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, అంతవరకు ఉద్యోగ నియామకాలు నిలుపుదలచేయాలని వారుప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ఎస్‌సిల పట్ల అనుచితంగా వ్యవహరించి దాదాపు 27 సంక్షేమ పథకాలు రద్దుచేసి అభివృద్ధిని అడ్డుకున్నారని చెప్పారు. నామినేటెడ్ పోస్టులలో మాదిగలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వారు కోరారు. ఎస్‌సి సప్లయి నిధులను వారికే అభివృద్ధికే ఖర్చు చేయాలని, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా వడ్డీ లేని రుణాలను అందించాలని, ల్యాండ్ పర్చేజింగ్ స్కీమ్ అమలు చేయాలని, దూరవిద్య బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ తిరిగి ప్రారంభించాలని, ప్రయివేట్ రంగాల్లో విద్యా ఉద్యోగాలకు అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు రామాంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షులు రమణయ్య, జిల్లా నాయకులు ఆంజనేయులు, ఎంఇఎఫ్ అధ్యక్షులు హరిబాబు, మాజీ సెక్రటరీ రాజా, లాయర్ల అధ్యక్షుడు వెంకటరమణ, ఉద్యోగ విభాగం నాయకులు ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షులు నరసింహులు, సీనియర్ నాయకులు సుబ్బయ్య, లక్ష్మయ్య, రమణ, వీరబల్లి నాయకులు శివ, రామ్మోహన్, బాలరాజు, రమణయ్య పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో మంత్రి

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం రాయచోటి పట్టణంలోని మాసాపేట, ఇందిరమ్మ కాలనీలో శ్రీకృష్ణ దేవాలయం విగ్రహ ప్రతిష్టాపనకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి గ్రామ పెద్దలు, ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం అర్చకులు భక్తిశ్రద్ధలతో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావాలన్నదే లక్ష్యం

డిఆర్‌ఒ సత్యనారాయణరావు



మహిళలకు సిఐఎఫ్ నిధుల మెగా చెక్కును అందజేస్తున్న డిఆర్‌ఒ

ప్రజాశక్తి - రాయచోటి

స్వయం సహాయక సంఘంలోని ప్రతి మహిళా లక్షాధికారి కావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని డిఆర్‌ఒ సత్యారాయణరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం రాయచోటి కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో 'ప్రధాన మంత్రి లాక్‌పతి దిది ఫెలిషిటేషన్" ముఖాముఖీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఆర్‌ఒ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ఎంతగానో తోడ్పాటు అందుస్తుందని చెప్పారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు బ్యాంకు రుణాలను, రివాల్వింగ్ ఫండ్, సిఐఎఫ్ నిధులను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి మహిళా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఉపయోగించుకొని లక్షాధికారిగా తయారు అవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు జిల్లా వ్యాప్తంగా 762 సంఘాలకు రూ.94.58 కోట్ల బ్యాంకు రుణాలు, రివాల్వింగ్ ఫండ్ మెగా చెక్కును అందించారు. వీరబల్లి, చిట్వేల్ మండలాలకు రూ. 20 లక్షల సిఐఎఫ్ నిధులను కూడా అందించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందేందుకు, మహిళా సాధికారత సాధించేందుకు ఎంతగానో తోడ్పాటు అందిస్తున్న ప్రభుత్వానికి మహిళలు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ బి.సత్యనారాయణ, వారి సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం

ఎమ్మెల్యే షాజహాన్ బాషా



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పచ్చదనంతోనే ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రెడ్డీస్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి, నీళు పోసి వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్యం పెరిగితే మానవ మనుగడకే ప్రమాదకరమని, స్వచ్ఛమైన ఆక్సిజన్ కావాలంటే, వాయు, శబ్ద కాలుష్యం తగ్గాలంటే అది కేవలం పచ్చదనంతోనే సాధ్యమని సూచించారు. పట్టణీకరణ పెరిగిపోతున్న తరుణంలో పచ్చదనం హరించుకోవడం, కాలుష్యం పెరిగడం వల్ల ప్రాణవాయువు కొరత ఏర్పడుతోందని చెప్పారు. అందుకు ఢిల్లీ పరిస్థితులే అద్దం పడుతున్నాయని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు చెట్లను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మార్పురి నాగార్జున బాబు, గంగారపు రామ్మూర్తి నాయుడు, నాగూర్ వలి, షంషీర్, బొమ్మిశెట్టి పురుషోత్తం, డ్యాన్స్ రెడ్డెప్ప, జంగాల వెంకటరమణ, బీదం గురునాథ్ యాదవ్, జెసిబి మధుసూదన్ రెడ్డి, నవీన్ చౌదరి, విద్యాసాగర్, జీవి నాయుడు, పూలకుంట్ల హరిబాబు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడేది లేదు : డిఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



మాట్లాడుతున్న డిఎస్‌పి సుధాకర్

శాంతి భద్రతల సంరక్షణలో రాజీ పడేది లేదని ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాజంపేట డిఎస్‌పి ఎన్.సుధాకర్ తెలిపారు. ఆదివారం డిఎస్‌పి కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ తాను గతంలో కడప జిల్లాలోని నందలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె తదితర మండలాలలో ఎస్‌ఐగా విధులు నిర్వహించానని తెలిపారు. గతంలో చిత్వేలిలో నక్సల్ ప్రభావం ఎక్కువగా ఉండడంతో అదుపు చేసేందుకు తనకు ప్రత్యేకంగా చిట్వేలికి రప్పించుకున్నట్లు గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉన్నందున డిఎస్‌పిగా సమర్థవంతంగా నిర్వర్తించగలనని అన్నారు. రైల్వేకోడూరు, రాజంపేటలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, ముందుగా ట్రాఫిక్ సమస్యను నియంత్రించానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు సహకరించి గంజాయి, స్మగ్లింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలు పట్ల తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల రక్షణకు కృషి చేస్తానని తెలియజేశారు.

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం వెన్నంటే అండగా ఉంటుందని టిడిపి నాయకులు సుగవాసి బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని గుండ్లూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన్ను డ్వాక్రా మహిళా సంఘాలు, ఫీల్డ్ అసిస్టెంట్ కలిసి తమ సమస్యలను తెలిపారు. తమ గ్రామంలో సిసి రోడ్లు లేవని., పలు రకాల సమస్యలను గ్రామ ప్రజలు సుగవాసి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సుగవాసి మాట్లాడుతూ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలియజేశారు. ఆయన వెంట టిడిపి జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు సంజీవరావు, రూరల్ మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీధర్ బాబు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు షామీర్‌బాష, నాగేశ్వర, శివప్రసాద్, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రహ్మణ్యం


మాట్లాడుతున్న తాతంశెట్టి నాగేంద్ర

రెడ్ బుక్ కాదు..గుడ్ బుక్ రాజ్యాంగం


ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం కాదు గుడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీల స్వర్ణ యుగానికి పలికిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన కనివిని ఎరుగని రీతిలో విజయవంతం అయ్యిందని అన్నారు. పవన్ పర్యటనకు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు వక్రీకరించి మాట్లాడటం పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు ఉందని అన్నారు. 14 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి సొంత ఊరికి బ్రిడ్జి, వీధిలైట్లు కూడా వేయించుకోలేని వ్యక్తి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గెలిచిన మూడునెలలకే ఉపముఖ్యమంత్రి పర్యటన రాష్ట్రంలోనే మొట్టమొదటి పర్యటన రైల్వేకోడూరుకు తీసుకు రావడం ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌కు అభివృద్ధిపై ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనమని అన్నారు. సభ విజయానికి నిత్యం వెన్నంటి నిలబడ్డ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, అధికారులకు, నాయకులకు అభినందనలు తెలిపారు.అసూయతో కొరముట్ల మాట్లాడుతున్నారని ఇప్పటికైనా అనవసర విమర్శలు మాని కోడూరు అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి సంయుక్త, పగడాల చంద్రశేఖర్, వెంకటేష్, బొక్కసం చలపతి, జోగినేని మణి పాల్గొన్నారు.

ఇంటి స్థలం చూపించండి సారూ..

-వృద్ధురాలు వేడుకోలు

ప్రజాశక్తి-సుండుపల్లి


మంజూరైన ఇంటి పట్టా


గంగులమ్మ

గత వైసిపి ప్రభుత్వంలో తనకు పక్కా గృహం మంజూరైందని అప్పటి రెవెన్యూ అధికారులు ఇంటి పట్టా ఇచ్చారని అయితే ఇప్పటి వరకు ఇంటి స్థలం చూపించలేదని గంగులమ్మ అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేశారు. సుండుపల్లి పంచాయతీ అగ్రహారం సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా సర్వేనెంబర్ 2141లో రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించి ఇంటి పట్టాను ఇచ్చి స్థలం చూపలేదన్నారు. అప్పటి నుంచి నేటి వరకు అధికారుల చుట్టూ తిరుగుతున్నానే తప్ప ఇంతవరకు స్థలం చూపె లేదని తెలిపారు. సంబంధించిన వీఆర్‌ఓలు పదేపదే అడిగినా పట్టించుకోవడంలేదని, గతంలో కూడా స్పందన కార్యక్రమంలో కలెక్టర్ అర్జీ సమర్పించినట్లు తెలిపారు. ఆ స్థలం ఎక్కడ ఉందో, ఎవరు ఆక్రమించుకున్నారో ఇంతవరకు తెలియదని అన్నారు. తనకు సొంత ఇల్లు లేదని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నా పట్టా స్థలాన్ని చూపించి ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు.

గాయపడిన వ్యక్తికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-సుండుపల్లి


ఇనాయాతుల్లాను పరామర్శిస్తున్న అమర్నాథ్‌రెడ్డి

కువైట్‌లో ప్రమాదవశాత్తు గాయపడి ఇంటికి వచ్చిన ఇనాయాతుల్లా మండలంలోని జికె రాచపల్లి లోని వారి స్వగృహంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి పరామర్శించి వారి కుటుంబానికి భరోసాను కల్పించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి ఇస్మాయిల్, అజంతమ్మ, రెడ్డమ్మ, నరసింహరెడ్డి, సర్పంచ్ జయచంద్ర, బాబురెడ్డి, చంద్రనాయక్, శేఖర్‌రెడ్డి, రెడ్డన్న నాయుడు, రషీద్, బద్రి, రమేష్, బాషా, సల్మాన్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త కుప్పలు - పట్టని అధికారులు

- వాహనదారులు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రమైన వేములలో రోడ్లపైనే చెత్త కుప్పలు దర్శన మిస్తున్నాయి. చెత్త కుప్పలను ప్రతి రోజూ అధికారులు దర్శించుకుంటున్నప్పటికీ వాటిని ఎత్తేయించడంలో వారు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వేముల జడ్‌పి పాఠశాల వెనుక వైపు, వైద్యశాల వద్ద, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారిలో చెత్త కుప్పలు ఉన్నాయి. రోడ్డుపైనే చెత్త ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధాన రోడ్డును డంపింగ్ యార్డుగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో రోడ్లన్నీ చెత్త కుప్పలుగా తయార య్యాయి. ఇప్పటికైనా అధి కారు లు స్పందించి రోడ్లపై ఉన్న చెత్తకుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను తెలుసు కోవ డానికి గ్రామ సభలను నిర్వహిస్తోందన్నారు. ఆ సభల వల్ల అధికారులు ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


పీలేరు : శ్రీకృష్ణుడు, సత్యభామ, గోపికల వేషధారణలో విద్యార్థులు



రైల్వేకోడూరు: కోలాటం ఆడుతున్న చిన్నారులు

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి: ఎమ్మెల్యే



నిమ్మనపల్లి: మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో లక్ పతి దీదీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం ఆదివారం స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయం వద్ద మహిళా సంఘాలను సమావేశం ఏర్పాటు చేసి రూ.3.3కోట్ల మెగా చెక్కును స్థానిక టిడిపి, జనసేన నాయకులతో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను పాతాళానికి అణచివేసిందని అన్నారు. నేడు ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి, ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే మహిళా సమాఖ్య సంఘాల్లోని మహిళలు వారి జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవటానికి, ఆర్థికంగా నిలబడటానికి రాష్ట్ర ప్రభుత్వం నిమ్మనపల్లి మండలంలోని 18 స్వయం సహాయక సంఘాలలోని 187 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.3.3 కోట్ల చెక్కును అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందించిన నగదుతో గ్రామీణ ప్రాంతంలోని డ్వాక్రా సంఘ మహిళలు లక్షాధికారులుగా ఎదగడానికి పాడి ఆవులను కొనుక్కొని, వాటి ద్వారా పాల ఉత్పత్తి సాధించి తద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థికంగా ఎదగాలని అన్నారు. టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసింది, సంఘాలకు అండగా నిలుస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబేనని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్ బాబు, ఎపిఎం రజనీకుమారి, సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, టిడిపి నాయకులు సుధాకర్‌రావు, మల్లికార్జున, రాజన్న, జనసేన ఉపాధ్యక్షులు ఈత కట్ల చంద్రశేఖర్, సిసిలు, సంఘమిత్రలు, నాయకులు పాల్గొన్నారు. **సుండుపల్లె :** ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య ఉద్దేశ్యమని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన లక్ పతి దీదీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుండుపల్లి మండలం బ్యాంకు లింకేజి ద్వారా 28 స్వయం సహాయక సంఘాలకు రూ. 2.82 కోట్ల చెక్కును మహిళలకు అందించారు. కార్యక్రమంలో ఎంపిపి రాజమ్మ, శివకుమార్‌నాయుడు, వెలుగు ఎపిఎం శ్రీనివాసులు అకౌంటెంట్ వెంకటేశు, సిసిలు మహిళా సంఘాల మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.**లక్కిరెడ్డిపల్లి :** స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళ ఆర్థిక శక్తిగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ గురు ప్రసాద్ పేర్కొన్నారు.మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సంతోష కుమారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ గురు ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం అందించి అభివృద్ధి కార్యక్రమాలు, స్వయం సహాయక రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభివృద్ధిలోకి రావాలని గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని సూచించారు. ఎపిఎం నిరంజన్ ప్రతి మహిళ ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు, టైలరింగ్, పాడి చేతివృత్తులు ఉత్పత్తుల తయారీ మొదలగునవి చేసుకుంటూ కుటుంబ ఆదాయం పది వేలు వచ్చే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పథకం గురించి డిఆర్‌పి రాజశేఖర్ మాట్లాడుతూ యూనిట్ పెట్టదల్చుకున్న వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో రుణాలు ప్రభుత్వం అందిస్తున్నదని రాజశేఖర్ తెలిపారు. మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అహల్య, సిసిలు, యానిమేటర్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- బి.కొత్తకోట

పిటియం మండలపరిధిలోని బూర్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో కృషి సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి వాలంటీర్ మాట్లాడుతూ హెచ్‌ఐవి లైంగికంగా సంక్రమించే అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు,ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు న్యాకో నేతృత్వంలో 'మీకు తెలుసా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి సూచనల ప్రకారం కృషి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం చేపట్టామని చెప్పారు.ప్రాజెక్టు ఔట్ రీచ్ వర్కర్ భారతి మాట్లాడుతూ ప్రజలకు హెచ్‌ఐవి, సుఖ వ్యాధుల గురించి పరిజ్ఞానం, అవగాహన పెంపొందించండానికి, సురక్షిత పద్ధతులు పాటించడానికి, హెచ్‌ఐవి ఉన్నవారి పట్ల వివక్ష తగ్గించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఎక్కువ మంది హెచ్‌ఐవి పరీక్షలు చేసుకునేందుకు ముందుకొచ్చేలా న్యాకో ఆదేశాను సారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపడతామని అన్నారు. హెచ్‌ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా, వారు మానసికంగా కృంగిపోకుండా సంతోషంగా జీవించవచ్చనే విషయాన్ని తెలిపారు.రెడ్ రిబ్బను క్లబ్‌ల ద్వారా విద్యార్థులు, వారి స్నేహితులకు అవగాహన కార్యక్రమాలు చేపడతారన్నారు. కార్యక్రమంలో కృషి సంస్థ,అవుట్ రిచ్ వర్కర్ భారతి, పీర్ ఎడుకేటర్స్ పద్మావతి, ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పి పి.బబితారెడ్డి, ఆశ కార్యకర్త సునీత, అంగన్వాడీ కార్యకర్త జానకి పాల్గొన్నారు.


ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తున్న కృషి వాలంటీర్లు

'మానవత' సేవలు ప్రశంసనీయం



మానవత సమావేశానికి హాజరైన సభ్యులు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మానవత నెలవారి సమీక్ష సమావేశం ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మానవత అధ్యక్షులు శెట్టి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ మానవత చేస్తున్న సేవలు ప్రశంసనీయమని, వీటి విస్తృతికి అందరం మరింత కృషి చేయాలని అన్నారు. మానవత చైర్మన్ వి. రామచంద్ర మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సభ్యత్వ నమోదులో భాగంగా సామాజిక సేవాభావం కలిగిన 325 మంది సభ్యుల పేర్లను నమోదు చేసుకుని, వారిలో 200 మందికిపైగా నూతన సభ్యులుగాను, 120 మందిని కుటుంబ సభ్యులుగాను చేర్చడం జరిగిందన్నారు. అలాగే రూ.2,03,000 నిధులను సేకరించి బ్యాంకులో జమ చేసినట్లు తెలిపారు. మానవత సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష కృషి చేసిన రాచపల్లి కృష్ణమూర్తికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వినూత్న కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం చేయడానికి నిర్ణయించారు. 1998 నుంచి 2020 మధ్య ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు వివిధ వర్గాల వారిని సన్మానించుకునేందుకు ఎంపిక చేయడం, దానికి కమిటీ కూడా ఆమోదం తెలపడం జరిగిందని అన్నారు. సెప్టెంబరు 5న జరిగే ఈ కార్యక్రమానికి కమిటీ సభ్యులు, మానవత సభ్యులు, శ్రేయోభిలాషులు అందరూ తప్పక కార్యక్రమాన్ని పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పెంజురి అశోక్, జి. రాజేంద్ర ,సుధాకర్ బాబు అక్రం బాష, పోతంశెట్టి రమేష్, పోస్టల్ జివి రమణ, వై.రామకృష్ణ, కన్వీనర్ వై. వెంకట రమణ, హెచ్‌ఎం పోకల తాతయ్య పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

మాజీ సైనికుల సంక్షేమానికి కంచర్ల శ్రీనివాసులు నాయుడు అందించిన సేవలు ప్రశంసనీయమని టిడిపి నాయకులు కట్టా దొరస్వామి నాయుడు కితాబిచ్చారు. ఆదివారం కమ్మవీధిలోని ఫంక్షన్ హాల్‌లో మాజీ సైనికుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మరోసారి అధ్యక్షులుగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా సి.లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటస్వామి, కార్యదర్శిగా సుబ్బరాయుడు, కోశాధికారిగా టి.ప్రతాప్ కుమార్ రెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన కట్టా దొరస్వామి నాయుడు మాటాడుతూ మదనపల్లి నియోజకవర్గంలో మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని కృషి చేస్తున్న కంచర్ల శ్రీనివాసులు నాయుడు మరోసారి మాజీ సైనికుల సంఘానికి అధ్యక్షులు కావడం శుభపరిణామమన్నారు. మాజీ సైనికుల న్యాయరమైన డిమాండ్ల సాధన కోసం ఆయన చేస్తున్న పోరాటం ప్రశంసనీయమన్నారు. మాజీ సైనికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించగల సమర్థుడని కొనియాడారు. అనంతరం నూతన అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ మాజీ సైనికుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. అన్యాక్రాంతానికి గురైన మాజీ సైనికుల భూములను కాపాడుతామని స్పష్టం చేశారు. మాజీ సైనికులను ఎవరైనా ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. తనకు మరోసారి అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన మాజీ సైనికులకు కృతజ్ఞతలు తెలియజేశారు. హక్కుల సాధన కోసం మాజీ సైనికులందరూ కలిసికట్టుగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మాజీ సైనికులు పాల్గొన్నారు.


శ్రీనివాసులు నాయుడును సన్మానిస్తున్న సంఘం సభ్యులు

తగ్గిన టమోటా ధరలు

జూన్, జులైలో బాక్స్ రూ.1,800 నుంచి రూ.2,000- ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టమోటా ధరలు ఒక్కసారి భారీగా తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆరుగాలం కష్టపడి లక్షల రూపాయల ఖర్చు చేసి టమాటా సాగు చేస్తే.. కనీసం పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు తగ్గడం, అదే సమయంలో గిట్టుబాటు ధర లభించక వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పంటకు తెగుళ్ల ఆశించి, దిగుబడులు తగ్గిపోయాయి. వచ్చిన కాస్తా పంట నాణ్యత లోపించడంతో తక్కువ ధరకే అమ్మాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్, జూలై నెలల్లో 25 కిలోలు (బాక్స్) టమాట రూ.1,800 నుంచి రూ.2,000 ఉండేది. ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300 మాత్రమే ఉంది. టమోటా సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు వస్తోందని రైతులు వాపోతున్నారు. మూడేళ్ల క్రితం ఇందులో సగం ఖర్చులే వచ్చేవి.. అప్పుడున్న ధరలే ప్రస్తుతం మార్కెట్‌లో కొనసాగుతున్నాయన్నారు. వాతావరణ పరిస్థితులన్నీ సహకరిస్తే ఎకరాకు 15 నుంచి 19 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది కానీ.. ప్రస్తుతం వివిధ కారణాలతో 10 క్వింటాళ్లకు మించడం లేదంటున్నారు. టమోటా కోతలు, మార్కెట్‌కు తరలింపు, రవాణా, ఎగుమతి దిగుమతి ఖర్చులు లెక్కిస్తే ఒక్కో బాక్స్‌కు రూ.40 వరకు వ్యయమైతుంది. ఒక్కో బాక్సుకు కమీషన్ రూ.10 ఇవ్వాల్సిన పరిస్థితి. ఇలా అన్నింటిని భరించి విక్రయించినా ప్రస్తుత ధరలతో భారీ నష్టమే వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





నూతనంగా ఎన్నికైన అపుస్మా కార్యవర్గం

అపుస్మా అధ్యక్షులుగా ఎం.వి.కుమార్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అపుస్మా) నియోజకవర్గ నూతన అధ్యక్షు లుగా రెండవసారి సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.వి.కుమార్‌ను ఎన్నుకున్నారు. పట్టణంలోని సిల్వర్ బెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పంజం సుకుమార్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా కె.చంగల్‌రాజు, ట్రెజరర్‌గా ఎ.గోపీనాథ్, వైస్ ప్రెసిడెంట్‌గా చిట్వేలి మండలానికి ఎన్.సుదర్శన్‌రెడ్డి, పుల్లంపేట మండలానికి బాలాజీబాబు, పెనగలూరు మండలానికి ఆర్ రవిశంకర్, ఓబుల వారిపల్లె మండలానికి చెందిన సత్యకుమార్ నియమితులయ్యారు. అడిషనల్ జనరల్ సెక్రటరీగా టి.ప్రదీప్, తులసి, రెడ్డయ్య నియమితులయ్యారు. లీగల్ అడ్వైజర్‌గా మల్లికార్జున్ నాయుడు, కమిటీ మెంబర్లుగా నరసిం హారెడ్డి, రాజశేఖర్, నరేష్, నరేంద్ర, నియమితులయ్యారు. మరొకసారి రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

పాము కాటుకు మహిళా రైతు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పొలం పనులు చేస్తున్న మహిళా రైతును పాము కాటేయడంతో మృత్యువాత పడ్డ విషాదకర ఘటన మదనపల్లె మండలంలో జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..మదనపల్లి మండలం చికిలబైలు పంచాయతీ జమ్ముకుంటపల్లికు చెందిన బాపనపల్లి రాజశేఖర్, కవిత దంపతులు రైతులు, రోజు మాదిరి గానే ఆదివారం కూడా గ్రామ సమీపంలో ఉన్న తమ వ్యవసాయ పొలానికి వెళ్లిందని తెలిపారు. పొలం పనులు చేస్తున్న కవిత కాలుపై చెట్ల పొదల్లో దాగిఉన్న పాము కాటేసింది. వెంటనే కుటుంబీకులు బాధితురాలిని మదనపల్లి సర్వజన బోధనాస్పత్రికి తరలించారు. పరీక్షించిన ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు ఆమె మార్గ మధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కవిత మృతితో గ్రామంలో విషాదం అలుముకున్నాయి.

జాతీయ ఉపాధ్యాయ సంబరాలకు పిటిఎం ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

జాతీయ స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలకు పిటిఎం మండలం భారత్ స్కూల్‌కి చెందిన ఉపాధ్యాయుడు జామకాయల వినయ్‌తేజ ఎంపికయ్యారు. విద్యాబోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఈ వేడుకలకు ఎంపిక చేస్తారు. ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువా,జ్ఞాపకతో సత్కరించడం జరుగుతుంది. సెప్టెంబర్ 5న జరిగే వేడుకల్లో ఆయన పాల్గొంటారు. మండలం నుంచి జాతీయస్థాయి ఉపాధ్యాయ వేడుకలకు ఎంపికైన వినయ్‌తేజని డిఇఒ, డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ, ఉపాధ్యాయులు అభినందించారు.

విషజ్వరాల నుంచి కాపాడండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాల నుంచి జిల్లా ప్రజలను, పిల్లల ప్రాణాలు కాపాడాలని, విషజ్వరాల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విషజ్వరాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పసిపిల్లలకు రక్త కణాలు సంఖ్య తగ్గపోయి అత్యవసరంగా తిరుపతి - బెంగళూరు పోతున్నారని, జిల్లాలో డెంగీ, మలేరియా లాంటి విషజ్వరాలు పంజా విసురుతున్నాయని, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి జ్వారాల బారిన పడిప ప్రజలును, పసి పిల్లలను కాపాడడాలన్నారు. జిల్లాలో ఆరోగ్య శాఖ, మున్సిపల్, పంచాయితీ శాఖ అధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగు పరచడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు రెడ్డెప్ప, తిరుమల, ముబారక్, మురళి, రవి పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

పైడిపాలెం రిజర్వాయర్‌కు పెరిగిన నీటి పంపింగ్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్‌కు నీటి పంపింగ్‌ను అధికారులు పెంచారు. గండికోట రిజర్వాయర్ నుంచి ప్రారంభంలో 500 క్యూసెక్కులు మాత్రమే పైడిపాలెం రిజర్వాయర్‌కు నీటిని లిఫ్ట్ ద్వారా పంపింగ్ చేశారు. రిజర్వాయర్‌ను కృష్ణా జలాలతో త్వరగా నింపాలనే లక్ష్యంతో 6 పంపుల నుంచి 600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నట్లు గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ డిఇ శ్రీనివాసులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 6 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యాంలో3.2 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆయన తెలిపారు. త్వరలో నీటి పంపింగ్ మరింత పెంచే అవకాశం ఉందని డిఇ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఇంటర్ విద్యార్థి అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట


హర్షద్‌ఖాన్(ఫైల్ ఫొటో)

ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన బి.కొత్తకోట మండలంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. వివరాలు బి.కొత్తకోట పట్టణం,బెంగళూరురోడ్డు, వాయిల వంకలో నివాసం ఉంటున్న పి.రియాసత్‌ఖాన్ కుమారుడు పి.హర్షద్ ఖాన్(17) ఈనెల 24వ తేదీ అనగా శనివారం ఉదయం ఇంటి నుంచి బయ లుదేరి సుంకు కాలేజీ వెళ్లాడు.అయితే మధ్యాహ్నం సుమారు మధ్యాహ్నం 3 గంటలకు కాలేజీలో లేడని అతని తండ్రికి కళాశాల వారు సమాచారం అందించారు.దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారు, బంధు వుల ఇళ్లల్లో వెతికారు. ఎక్కడ వెతికినా తమ కుమారుడి ఆచూకీ దొరకనందున ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.వారి ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట సిఐ రాజారెడ్డి ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ నాగరాజ గౌడ్ బాలుడి అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలోని బండ్ల వంక ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు రెండు ఆలయాల్లో చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి స్థానిక బండ్ల వంకలోని నడివీధి గంగమ్మ ఆలయంలోను, అక్కడికి సమీపంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద ఉన్న ఎల్లమ్మ గుడిలోనూ చోరీలు జరిగాయి. ఈ సందర్భంగా దుండగులు ఆలయాల్లోని హుండీలు పగలగొట్టి భక్తులు అమ్మవార్లకు సమర్పించిన కానుకలను దోచుకు వెళ్లినట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భంగా ఆలయాల్లో ఏ మేరకు నష్టం జరిగిందో పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.